# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 9 ఫిబ్రవరి 2026


## 25వ వార్డులో

## స్వతంత్ర అభ్యర్థి పిట్టల దేవిక విస్తృత ప్రచారం


### -ఎయిర్ కండిషన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి



**జమ్మికుంట, ఫిబ్రవరి 8 (నినాదం) :**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ని 25వ వార్డు లో స్వతంత్ర పార్టీ అభ్యర్థి పిట్టల దేవిక రాజు తమకు కేటాయించిన ఎయిర్ కండిషన్ గుర్తుకు ఓటు వేయాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆదివారం వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ఎయిర్ కండిషన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తూ తాము గెలిస్తే వార్డు రూపురేఖలు మారుస్తామని ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఒక విద్యావేత్తగా కాలనీ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని గత పాలకుల నిర్లక్ష్యం వల్ల 25వ వార్డు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని వార్డు ప్రజలు ఆలోచించు పార్టీలకు అతీతంగా తనను గెలిపిస్తే అభివృద్ధి విషయంలో రాజీపడకుండా పనులు చేస్తానని ఆమె పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా తాను ఎక్కడికి వెళ్లినా వార్డు ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తూ ఆశీర్వదిస్తున్నారని ఆమె తెలిపారు.

## కుష్టు వ్యాధిగ్రస్తులకు దేవుడు బాబా ఆమ్టే

### ఫిబ్రవరి 9...బాబా మురళీధర్ దేవదాస్ ఆమ్టే వర్ధంతి



.ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన మహోన్నత వ్యక్తి బాబా ఆమ్టే. సంఘ సేవకుడిగా ప్రసిద్ధిగాంచిన బాబా ఆమ్టే ముఖ్యంగా కుష్టు రోగుల పాలిట దేవుడిగా భావించ బడ్డారు. అమ్టే భారతీయ సామాజిక కార్యకర్త, లక్ష్య సిద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి. సామాజిక సేవే పరమావధిగా ఎంచి, జీవితాన్ని అందుకు దారవోసిన ధన్య జీవి ఆయన.

కుష్టురోగుల సేవలకై చంద్రాపూర్ జిల్లాలో ఆనంద్‌వన్ ఆశ్రమాన్ని స్థాపించి అయన కూడా వారితోపాటే అక్కడే జీవితాన్ని గడిపి 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమంలోనే మృతి చెందిన త్యాగశీలి. అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన మహనీయుడు. డిసెంబర్ 26, 1914లో మహా రాష్ట్రలోని వార్ధా జిల్లా హింగన్ ఘాట్‌లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబంలో జన్మించాడు మురళీధర్ దేవదాస్ ఆమ్టే. బాబా అనేది తల్లిదండ్రులు పెట్టిన ముద్దుపేరు. న్యాయ శాస్త్రంలో శిక్షణ పొందిన తరువాత వార్ధాలో న్యాయ అభ్యాసం ప్రారంభించాడు. అదే సమయంలో భారత జాతీయోద్యమ పోరాటం జరుగుతుండేది. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్ట్ కాబడిన జాతీయ నేతల తరఫున కోర్టులలో వాదించేవాడు. క్రమక్రమంగా మహాత్మా గాంధీ వైపు ఆకర్షితుడైనాడు. గాంధీజీతో పాటు కొంత కాలం సేవాగ్రం ఆశ్రమంలో గడిపినాడు. ఆ తరువాత జీవితాంతం వరకు గాంధీజీ సిద్ధాంతాలకే కట్టుబడినాడు. వేషధారణలో కూడా గాంధీజీ వలె ఖద్దరు దుస్తులనే వాడేవాడు. గాంధీజీ వలె జీవితాంతం అణగారిన వర్గాల కృషికై పాటుపడ్డాడు.బాబా ఆమ్టే స్థాపించిన మూడు ఆశ్రమాల్లో ఆనంద్‌వన్ మొదటిది. కుష్టురోగుల సంక్షేమానికి మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో ఈ ఆశ్రమాన్ని 1951లో స్థాపించాడు. ఆనంద్‌వన్ వరోరాకు దగ్గరలోని అటవీ ప్రాంతంలో 50 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని ప్రారంభించాడు. అది క్రమక్రమంగా పెద్దదై నేడు 500 ఎకరాలకు విస్తరించింది. ఆ రోజులలో కుష్టురోగులకు సమాజం నుంచి వెలివేసేవారు. అలాంటి వారి కొరకు ఆశ్రమాన్ని స్థాపించి కుష్టురోగులను చేరదీసి వారితో పాటు అతడు కూడా అక్కడే వారి సంక్షేమం చూస్తూ గడపటం గొప్పవిషయం. కుష్టువ్యాధి ఒక అంటురోగమని, కుష్టురోగులను తాకినా ఆ వ్యాధి వస్తుందనే ప్రచారంలో ఉన్న సమయంలో బాబాఆమ్టే ఆ వదంతులను త్రిప్పికొట్టడానికి స్వయంగా ఒక కుష్టురోగి నుంచి బాసిల్లి క్రిములను తన శరీరంలో ఇంజెక్షన్ ద్వారా ఎక్కించు కున్నాడు. కుష్టురోగులకై బాబాఆమ్టే తదనంతరం సోమనాథ్, అశోకవన్ ఆశ్రమాలను కూడా స్థాపించాడు. సమాజసేవ విషయంలో ఆనంద్‌వన్ ఆశ్రమం ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. ఆనంద్‌వన్ కై బాబాఆమ్తేకు 1983లో డేమియన్ డట్టన్ లెప్రసీ సంస్థనుంచి డేమియన్ డట్టన్ అవార్డు కూడా లభించింది. ప్రస్తుతం ఆనంద్‌వన్ రెండు ఆసుపత్రులను, ఒక విశ్వ విద్యాలయాన్ని, ఒక అంధుల కొరకు పాఠశాలను, ఒక అనాథ శరణాలయాన్ని కలిగిఉంది. ఈ ఆశ్రమంలో 5000కు పైగా నివసిస్తున్నారు.

బాబా ఆమ్టే, గాంధీజీ సిద్ధాంతాలు

బాబాఆమ్టే గాంధీజీ సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి పూర్తిగా ఆచరించిన మహనీయుడు. గాంధీజీతో పరిచయమైన తరువాత అతనితో పాటు కొద్ది రోజులు సేవాగ్రామ్ ఆశ్రమంలో గడిపి గాంధీజీ శిష్యుడిగా మారి, ఆయన సిద్ధాంతాలను పూర్తిగా వంటపట్టించు కున్నాడు. కుష్టురోగులకు భయపడక వారి సంక్షేమానికి అయన చేస్తున్న కృషికి బాబాఆమ్టేకు గాంధీజీ "అభయసాధక్" అనే బిరుదు ఇచ్చాడు. ఆ తరువాత బాబా ఆమ్టే సిద్ధాంతాలపై కూడా గాంధీజీ ప్రభావం చాలా పడింది. శేషజీవితం అణగారిన వర్గాల కొరకే గడపడమే కాకుండా, వస్త్రధారణలో ఖద్దరు బట్టలనే ధరించడం ఇత్యాది విషయాలలో ఆ ఇద్దరిలో సామ్యముంది. అంతేకాదు ఆశ్రమాల్లో గడుపుతూ పూర్తి శాకాహార భోజనం చేస్తూ జీవనం గడిపినాడు. గాంధీజీ వలెనే స్వయంసమృద్ధి గ్రామాలు ఉండాలని ఆకాంక్షించాడు. గాంధీజీ బ్రిటీష్ వారిపై అహింసా పోరాటం జరిపినట్లే బాబా ఆమ్టే కూడా నర్మదా బచావో ఉద్యమంలో కూడా ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా అహింసాయుత పోరాటం కొనసాగించాడు.తుదిశ్వాస వదిలే వరకు తాను నమ్మిన సిద్ధాంతాలకే పాటుపడి, తన ఆశయమే లక్ష్యంగా కృషిసల్పి, 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమం ఆనంద్‌వన్‌లో బాబా ఆమ్టే 94 సంవత్సరాల వయస్సులో కన్నుమూశాడు. అనేక దశాబ్దాల పాటు దీనజన ప్రజల కోసం కృషిసల్పిన బాబా ఆమ్టేకు అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఎన్నో లభించాయి. అవార్డులతో పాటు లభించిన నగదును సాంఘిక కార్యకలాపాల కోసమే వినియోగించాడు. 1971లో భారత ప్రభుత్వపు పద్మశ్రీ అవార్డు, 1974లో మహారాష్ట్ర ప్రభుత్వపు దళిత్ మిత్రా అవార్డు ,1978 లో రాష్ట్రీయ భూషణ్ అవార్డు, 1979 లో జమన్‌లాల్ బజాజ్ అవార్డు, 1983లో అమెరికాకు చెందిన డామియెన్ డట్టన్ అవార్డు (కుష్టువ్యాధి పీడితుల కోసం కృషిసల్పిన వారికిచ్చే ప్రపంచంలో అత్యున్నత అవార్డు), 1985లో రామన్ మెగ్సేసే అవార్డు, 1985లో మధ్య ప్రదేశ్ ప్రభుత్వపు ఇందిరా గాంధీ స్మారక అవార్డు ,1986లో భారత ప్రభుత్వపు పద్మవిభూషణ్ అవార్డు, 1986 లో రాజారాంమోహన్ రాయ్ అవార్డు, 1988లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల అవార్డు,

1988లో జి.డి.బిర్లా అంతర్జాతీయ అవార్డు, 1988లో ఫిక్కి అవార్డు, 1989లో అంతర్జాతీయ జిరాఫీ అవార్డు, 1990లో టెంపుల్టన్ అవార్డు, 1991లో రైట్ లివ్లీహుడ్ అవార్డ్ (ఈ అవార్డు ప్రత్యమ్నాయ నోబెల్ బహుమతిగా పేరుపొందింది), 1991లో ఆదివాసీ సేవక్ అవార్డు, 1992లో మహారాష్ట్ర ప్రభుతపు అంబేద్కర్ దళిత్ మిత్ర అవార్డు,

1997లో మహాత్మా గాంధీ చారిటేబుల్ ట్రస్ట్ అవార్డు, 1999లో గాంధీ శాంతి బహుమతి, 1999లో అంబేద్కర్ అంతర్జాతీయ అవార్డు, 2008లో భారత్‌వాసా అవార్డు లభించాయి.

**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్,**
**9440595494**

# ఫోటోగ్రఫీ రంగంలో జమ్మికుంట వాసికి అరుదైన గౌరవం

### - విజయగిరి రాంబాబుకు 'హానర్' పురస్కారం




**జమ్మికుంట, ఫిబ్రవరి 8 (నినాదం):**
ఫోటోగ్రఫీ రంగంలో తనదైన ముద్ర వేస్తూ, అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్న కరీంనగర్ జిల్లా, జమ్మికుంటకు చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ విజయగిరి రాంబాబు మరో ప్రతిష్టాత్మక మైలురాయిని అధిగమించారు. సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ ఆధ్వర్యంలో, ఆదివారం రోజున హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు గౌరవప్రదమైన 'హానర్' ధ్రువీకరణ పత్రాన్ని ప్రదానం చేశారు.

**- ప్రముఖుల చేతుల మీదుగా సత్కారం**
ఫోటోగ్రఫీలోని వివిధ విభాగాల్లో రాంబాబు కనబరుస్తున్న సృజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యాన్ని గుర్తించిన అకాడమీ ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది. ఈ వేడుకలో ప్రముఖ సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, జేఎన్‌యూ హెచ్‌ఓడీ ఏ.ఆర్. కమల్ రాయ్, ఎం.సి. శేఖర్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫోటోగ్రఫీ జాతీయ అధ్యక్షుడు జి.ఆర్. సత్యనారాయణ, ఏ.కే. అగర్వాల్ తదితరులు పాల్గొని రాంబాబును ఘనంగా సత్కరించారు.

**- అవార్డుల పరంపర**
రాంబాబు గతంలోనూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు ప్రస్తుత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహించిన పలు రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొని తన ప్రతిభతో అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు. తాజా అంతర్జాతీయ స్థాయి గుర్తింపుతో ఆయన కీర్తి కిరీటంలో మరో విదేశీ గౌరవం చేరినట్లయింది. ఈ సందర్భంగా జమ్మికుంట ప్రాంతానికి చెందిన పలువురు ఫోటోగ్రాఫర్లు, మిత్రులు మరియు ప్రముఖులు రాంబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన సాధించిన ఈ విజయం తోటి ఫోటోగ్రాఫర్లకు స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు.

# 3వ వార్డులో నేతల తలరాతలు మార్చనున్న స్వతంత్ర అభ్యర్థి

### -ప్రచారంలో దూసుకెళ్తున్న బోనగిరి జ్యోతి

### -ఆదరిస్తున్న వార్డు ప్రజలు

**జమ్మికుంట, ఫిబ్రవరి 9 (నినాదం) :**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో స్వతంత్ర అభ్యర్థి బోనగిరి జ్యోతి ఇండిపెండెంట్ అభ్యర్థిగా తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కుట్టు మిషన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వార్డులో విస్తృత ప్రచారం చేస్తున్న జ్యోతి. ప్రధాన పార్టీల అభ్యర్థుల తలరాతలు మార్చే విధంగా జ్యోతి తన ప్రచారాన్ని కొనసాగిస్తూ గెలుపు దిశగా దూసుకు వెళ్తున్నారు. గతంలో సర్పంచ్ గా పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయిన జ్యోతి ఈసారి గెలుపే లక్ష్యంగా తన ప్రచారాన్ని కొనసాగిస్తూ వార్డు ప్రజల ఆశీర్వాదం పొందుతున్నారు. కులమతాలకు పార్టీలకు అతీతంగా జ్యోతిని వార్డు ప్రజలు ఆదరిస్తూ ఆశీర్వదిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే వార్డు అభివృద్ధి విషయంలో రాజీపడకుండా సేవ చేస్తానని నిజాయితీకి పనిచేసే వారిని ప్రజలు ఎన్నుకోవాలని తెలిపారు. తనపై ప్రేమతో మద్దతు తెలుపుతున్న వార్డు ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గెలుపు ఎలక్షన్ గా దూసుకెళ్తున్న జ్యోతి కి రామన్న పల్లె గ్రామ వార్డు ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నట్లు స్థానికంగా జోరుగా చర్చ జరుగుతుంది.



## అడవి 'నాయక'త్వం..

## ధర్మపోరాటంలో ఆదిమ వీరత్వం!

భారతీయ ఇతిహాసం అంటే కేవలం కురుపాండవుల రక్తపాతం మాత్రమే కాదు.. అది అడవికీ, అగ్రవర్ణ నాగరికతకూ మధ్య జరిగిన అద్భుత సమన్వయం. పట్టు పరుపుల మీద పెరిగిన పాండవ మధ్యముడు 'భీముడు'.. అడవిని నమ్ముకున్న ఆదిమ వీరవనిత 'హిడింబి' పాదాల చెంత మోకరిల్లిన నాడే మహాభారత గమనంలో ఒక నవశకం మొదలైంది. కానీ, దురదృష్టవశాత్తూ మన చరిత్రకారులు అడవి బిడ్డల త్యాగాలను 'రాక్షస' ముద్ర వేసి అగాధంలోకి తొక్కేశారు. నాయక పోడ్లు అనే గిరిజన వీర తెగ ప్రస్తావన లేని పాండవ వనవాసం ఒక అసంపూర్ణ కావ్యం.

**రాక్షసత్వం కాదు.. అది రక్షణ కవచం!**
వారణావతపు కుట్రల నుంచి ప్రాణాలతో బయటపడి, నిప్పులు చెరిగే కళ్లతో అడవిలోకి అడుగుపెట్టిన పాండవులకు ఆశ్రయమిచ్చింది పచ్చని ప్రకృతి మాత్రమే కాదు, ఆ ప్రకృతిని కంటికి రెప్పలా కాపాడుకునే నాయక పోడ్లు. హిడింబిని 'రాక్షసి' అని పిలవడం ఆమెను అవమానించడమే. ఆమె ఒక రాజ్యానికి వారసురాలు, ఒక తెగకు ఆశాకిరణం, యుద్ధ తంత్రం తెలిసిన వీరనారి. పరాయి వ్యక్తులు తమ అడవిలోకి అడుగుపెడితే గొడ్డలి పట్టే ఆమె తెగువ రాక్షసత్వం ఎలా అవుతుంది? అది తన మట్టిని కాపాడుకునే మాతృత్వపు ఆవేదన. భీముడి భుజబలాన్ని చూసి మోహించడమంటే, ఒక వీరుడికి మరో వీరవనిత ఇచ్చిన అత్యున్నత గౌరవం.

**పోడు వ్యవసాయం - అక్షయపాత్ర సిద్ధాంతం**
నాగరిక ప్రపంచానికి కొండల మీద వ్యవసాయం చేయడం అంటే అద్భుతం కావచ్చు, కానీ నాయక పోడ్లకి అది జీవనవేదం. పాండవుల వనవాస కాలంలో వారికి ఆకలి తీర్చింది అక్షయపాత్ర మాత్రమే కాదు.. ఆ పాత్రలోకి ధాన్యాన్ని, కందమూలాలను చేర్చిన నాయక తెగ శ్రమ. కొండలను పిండి చేసి పంటలు పండించే పోడు సంస్కృతే పాండవుల మనుగడకు ప్రాణాధారమైంది. ద్రౌపదికి సౌగంధిక పుష్పాలు దొరికినా, అర్జునుడికి పాశుపతాస్త్రం లభించినా.. వాటన్నింటి వెనుక అడవి బిడ్డల అడుగుజాడలు ఉన్నాయి. సాక్షాత్తు పరమశివుడు కూడా అర్జునుడి గర్వాన్ని అణచడానికి ఒక 'కిరాతకుడి' (నాయక వేటగాడి) రూపంలో వచ్చాడంటే, ఆ తెగకున్న సామాజిక గౌరవం ఎంతో అర్థం చేసుకోవచ్చు.

**ఘటోత్కచుడు! ఒక జాతి త్యాగ నిరతికి పతాక!**
మహాభారత సంగ్రామంలో అత్యంత విషాదకరమైన, వీరోచితమైన ఘట్టం ఏదైనా ఉంటే అది ఘటోత్కచుడి వీరమరణమే. రాజ్యాధికారం కోసం సోదరులు కొట్టుకుంటుంటే, ఏ సంబంధం లేని అడవి బిడ్డ తన తండ్రి పక్షాన నిలిచి కురుసేనను చీల్చి చెండాడాడు. కర్ణుడి వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని తన గుండెకు అడ్డుపెట్టుకుని అర్జునుడిని కాపాడిన ఆ ప్రాణ త్యాగం.. అడవి బిడ్డల విశ్వసనీయతకు నిదర్శనం. హిడింబి తన కొడుకును యుద్ధానికి పంపుతూ అడవి నేర్పిన నీతిని, ధర్మాన్ని గుండెల్లో నింపి పంపింది. ఒక తల్లిగా తన పేగును కోసుకుని ధర్మ సంస్థాపన కోసం ఆహుతి ఇచ్చిన ఆ గొప్పతనం ఏ రాజకుమారికి ఉంటుంది?

**నేటికీ సజీవం.. ఆ వీరగాథ!**
తెలంగాణ నుంచి ఒడిశా వరకు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తరించిన నాయక పోడ్ల సంస్కృతి నేటికీ హిడింబిని 'వనదేవత'గా కొలుస్తోంది.

# అధికార కాంగ్రెస్‌తోనే వార్డుల అభివృద్ధి

### మెట్‌పల్లి 1వ వార్డులో ఇంటింటి ప్రచారం



**మెట్‌పల్లి ఫిబ్రవరి 8 (నినాదం):**
వార్డుల అభివృద్ధి కావాలంటే అధికార పార్టీ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాల్సిందేనని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం మెట్‌పల్లి పట్టణ 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓంకార్ నవీన్కు మద్దతుగా వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. గత పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగులు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు.కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, 2 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేస్తోందని తెలిపారు. త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందుకే కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# గెలుపు దిశగా అడ్లూరి ప్రచారం





### -అభివృద్ధిసంక్షేమ అజెండాతో ప్రజల్లో చురుకైన చర్చ

### -ధర్మపురి మున్సిపల్ ఎన్నికల్లో వేడెక్కిన రాజకీయ సమీకరణాలు

**ధర్మపురి. ఫిబ్రవరి 08 ( నినాదం ):**
ధర్మపురి మున్సిపాలిటీ ఎన్నికల వేడి రోజురోజుకు ఉద్ధృతమవుతున్న వేళ, స్థానిక రాజకీయాల్లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేరు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి, సంక్షేమం, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అనే అంశాలను ముందుకు తెచ్చి నిర్వహిస్తున్న ప్రచారం ప్రస్తుతం ఎన్నికల పోటీలో కీలక అంశంగా మారినట్లు స్థానిక రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వచ్చే నాయకుల కంటే, నిరంతరం ప్రజల సమస్యలపై స్పందించే నాయకుడిగా అడ్లూరి గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. పట్టణంలో మౌలిక సమస్యల పరిష్కారం కోసం ముందుండి కృషి చేస్తున్న నాయకుడిగా ప్రజల్లో విశ్వాసం పెరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**అభివృద్ధే ప్రధాన అజెండా**
పట్టణంలో రహదారుల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా సమస్యల పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ప్రచార వర్గాలు పేర్కొంటున్నాయి. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు సాగితేనే పట్టణానికి మేలు జరుగుతుందని మంత్రి ప్రచారంలో ప్రస్తావిస్తున్నట్లు సమాచారం.

**సంక్షేమ పథకాలపై దృష్టి**
పేద కుటుంబాలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సహాయం చేయడంలో చొరవ చూపుతున్నారని మద్దతుదారులు చెబుతున్నారు. పింఛన్లు, గృహ పథకాలు, విద్యా సహాయాలు వంటి అంశాల్లో ప్రజలకు మార్గదర్శకత్వం అందిస్తున్నారని పేర్కొంటున్నారు.

**అన్ని వర్గాలకు అందుబాటులో నాయకత్వం**
పార్టీ, కులం, వర్గం అనే భేదాలు లేకుండా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నించడం వల్ల విస్తృత మద్దతు లభిస్తోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజల్లో వినిపిస్తున్న అభిప్రాయం**
ఎన్నికల ప్రచారం సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి పనులు కొనసాగాలంటే సమన్వయం అవసరమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించే నాయకత్వానికి మద్దతు ఇవ్వాలనే భావన ఓటర్లలో పెరుగుతోందని చెబుతున్నారు.

**బీఆర్ఎస్, బీజేపీకి షాక్**
ఇదిలా ఉండగా, ధర్మపురి రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేష్‌తో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ధర్మపురి ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు లశెట్టి మహేష్ తమ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.ధర్మపురి క్యాంప్ కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ విధానాలు, నాయకత్వంపై నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కొత్తగా చేరిన నాయకులు తెలిపారు.

**జోరుగా ఇంటింటా ప్రచారం**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ధర్మపురి పట్టణంలోని 6వ, 12వ, 13వ వార్డుల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలనీ ప్రజలను కోరారు.ఈ సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న మంత్రి, ఎన్నికల సమయంలో వ్యక్తిగత విమర్శలకంటే అభివృద్ధి అంశాలపై చర్చ జరగాలని సూచించారు. రాజకీయ విభేదాలు ప్రజా ప్రయోజనాలకు ఆటంకం కలిగించకూడదని అన్నారు.

**తుది తీర్పు ఓటర్ల చేతుల్లోనే**
ప్రస్తుతం ప్రచార వేడి, ప్రజల్లో వినిపిస్తున్న చర్చల ప్రకారం అడ్లూరి ప్రచారం ముందంజలో ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, తుది నిర్ణయం మాత్రం ఓటర్లదేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటు న్నారు. రానున్న రోజుల్లో ప్రచారం మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.